క్లుప్తంగా

ఆర్టీసీ ఎండీకి శుభాకాంక్షలు



సజ్జనార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కిషోర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) ఎండీ వీసీ.సజ్జనార్ పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం ఆయనను మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఒగ్గ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ.సజ్జనార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు శాఖను పటిష్టపరిచేందుకు కృషిచేసిన సజ్జనార్ ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నారని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్నీ ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.

రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయండి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మేయర్ పారిజాత తదితరులు

బడంగ్‌పేట్: గుర్రంగూడ ప్రధాన రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత కోరారు. ఈ మేరకు గురువారం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. గతంలో హెచ్‌ఎండీఏ నిధులు మంజూరైనట్లు అప్పటి ప్రభుత్వం తెలిపిందని, కానీ పనులు మాత్రం చేయలేదన్నారు. రోడ్ల విస్తరణ కోసం సుమారు రూ.5 కోట్లు కేటాయించాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

ఎంపీడీఓ వెంకటమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీఓ తులసి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆడపిల్లల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ వెంకటమ్మ కోరారు. గురువారం మండలంలోని సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓతో పాటు ఇన్‌చార్జి సీడీపీఓ శాంతిశ్రీలు మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా వేగంగా పెరిగిపోతుందని తెలిపారు. ఈ ఉచ్చులో ఎంతో మంది అమ్మాయిలు చిక్కుకుంటున్నారని, దీనికి కారణం పేదరికమేనన్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకొని ఉద్యోగం, సినిమా అవకాశాలు, ప్రేమ, పెళ్లి పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలతో సన్నిహితంగా ఉండే అంగన్‌వాడీ టీచర్లు అలాంటి వారి ఆర్థిక సామాజిక స్థితిగతులను గమనించి, వారికి తగిన అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా యుక్త వయస్సు యువతులు, మహిళా సంఘాల వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ సురేశ్, సూపర్‌వైజర్ పల్లవి, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ అంబర్‌సింగ్, మతిలిరాజ్, చెన్నకేశవ్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సరళ, కల్పన, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సభ్యుడికి సత్కారం

ఆమనగల్లు: రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ చారకొండ వెంకటేశ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం ఆమనగల్లు అధ్యక్షుడు మహేశ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో సంఘం సభ్యులు సురేశ్‌నాయక్, కిరణ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ అవుట్‌పాయింట్‌తో తిప్పలు

- ఇరుకురోడ్డుతో నిత్యం ట్రాఫిక్ జామ్
- విలేజ్ రోడ్డుకు అవుట్ పాయింట్ లింకుచేస్తే మరిన్ని ఇక్కట్లు
- బిజినెస్ దెబ్బతింటుందటూ వ్యాపారుల ఆందోళన
- విలేజ్ రోడ్డుకు అనుసంధానం చేయొద్దంటూ విన్నపం



విలేజ్‌రోడ్డులో వాహనాల రద్దీ



విలేజ్ రోడ్డుపై ఉన్న దుకాణాలు



కొనసాగుతున్న బస్‌స్టేషన్ విస్తరణ పనులు

చేవెళ్ల: ఆర్టీసీ బస్ స్టేషన్ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న నూతన మార్గాలను ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్మించొద్దని చేవెళ్ల గ్రామస్తులు, దుకాణాదారులు కోరుతున్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్ స్టేషన్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు దాదాపు పూర్తి కావొస్తున్నాయి. బస్ స్టేషన్ నుంచి బస్సులు బయటకు వెళ్లే అవుట్ పాయింట్‌ను చేవెళ్ల విలేజ్ రోడ్డుకు ఏర్పాటు చేసేలా మార్క్ చేశారు. డిజైన్ ప్రకారం కాంట్రాక్టర్ తన పనులను యాథావిధిగా కొనసాగిస్తున్నాడు. ఈ రోడ్డుకు అవుట్‌పాయింట్ పెట్టడంతో నిత్యం విలేజ్ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని వాపోతున్నారు. ప్రస్తుతం బస్ స్టేషన్‌కు ఉన్న ఇన్, అవుట్ పాయింట్‌లనే యాథావిధిగా కొనసాగించేలా చూడాలంటున్నారు. అలాకాకుండా బస్సులు బయటకు వెళ్లే అవుట్ పాయింట్ మార్గాన్ని ప్రధాన రోడ్డుకు కాకుండా విలేజ్ రోడ్డుకు మార్చటంతో ప్రజలు, ఈ రోడ్డుపై ఉన్న దుకాణాదారులకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు మరోసారి ఆలోచన చేయాలని కోరుతున్నారు. గతంలో మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఈ బస్ స్టేషన్ పరిశీలనకు వచ్చినప్పుడు సైతం గ్రామస్తులు, స్థానిక నాయకులు ఈ విషయంపై ఆయనకు చెప్పి ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలని కోరామని స్థానికులు చెబుతున్నారు.

ప్రజలు, వ్యాపారులకు తప్పని ఇబ్బందులు

అవుట్‌పాయింట్ ఈ రోడ్డులో ఏర్పాటు చేస్తే తమకు తీవ్ర నష్టమవుతుందని వ్యాపారులు అంటున్నారు. అంతేకాదు బస్సులు నిత్యం వచ్చి వెళ్తుండటంతో ఈ దుకాణాల ఎదుట ప్రైవేట్ వ్యక్తులు వాహనాలు పార్కు చేసుకునే అవకాశం ఉండదని, అలా అయితే ప్రజలు దుకాణాలవైపు రాలేరని పేర్కొంటున్నారు. ఇది ప్రైవేట్ దుకాణాదారులే కాదు, ఆర్టీసీ ఏర్పాటు చేసిన దుకాణాల సముదాయంలో ఉన్న వ్యాపారులకు సైతం ఇబ్బందిగానే మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభ దశలోనే ఈపనులు ఉన్నాయని ఇప్పుడు అధికారులు ఈ రోడ్డు అవుట్ పాయింట్‌ను పాత రోడ్డులోకే మారిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే స్థానిక ప్రజలు, వ్యాపారులంతా కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

నిత్యం ఇబ్బందులే



బస్ స్టేషన్ నుంచి బటయకు వచ్చే బస్సుల కోసం విలేజ్‌రోడ్డుకు అవుట్ పాయింట్ పెడితే బస్సులు వచ్చే ప్రతిసారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ రోడ్డు ఇరుకుగా ఉంది. ప్రస్తుతం అవుట్ పాయింట్ లేకుండానే రోడ్డుపై వాహనాల రద్దీతో నిత్యం అవస్థలు పడుతున్నాం. ఇక బస్సులు కూడా ఈ రోడ్డుపైనే వెళ్తే మా వ్యాపారాల పరిస్థితి ఏమి కావాలి. ఆర్టీసీ అధికారులు ఈ బస్సులు బయటకు వెళ్లే అవుట్ పాయింట్‌ను వెంటనే మార్చాలి. – ముఖేశ్, ఫుట్‌వేర్ దుకాణాదారుడు

ట్రాఫిక్ జామ్ అవుతుంది



హైదరాబాద్–బీజాపూర్ రహదారికి విలేజ్ రోడ్డు ఆనుకొని ఉంది. అదేవిధంగా బస్‌స్టేషన్‌కు కూడా పాత రోడ్డు అలాగే ఉంది. విలేజ్ రోడ్డుకు అవుట్ పాయింట్ ఏర్పాటు చేస్తే గ్రామస్తులకు అవస్థలు తప్పవు. ఇప్పుడు దుకాణాల ఎదుట ఉన్న పార్కింగ్ సరిపోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇక బస్సులు కూడా ఈ రోడ్డుపై వెళ్తే నరకప్రాయంగా మారుతుంది. దీనిని ప్రధాన రోడ్డుకే మార్చాలి. విలేజ్ రోడ్డుకు ఏర్పాటు చేయొద్దు. – సి.పాండు, బ్యాంగిల్ స్టోర్ యజమాని

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించాలి. ఈ రోడ్డుతో ఇబ్బంది పడే విషయం అందరికీ తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యేతో చర్చించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఈ బస్‌స్టేషన్ అవుట్ పాయింట్‌ను విలేజ్ రోడ్డు నుంచి మార్చేలా చొరవ తీసుకోవాలి. లేదంటే ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పవు. – కుంచం శ్రీనివాస్, గ్రామస్తుడు, చేవెళ్ల

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

మున్సిపల్ కమిషనర్ వెంకన్న



గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

షాద్‌నగర్‌రూరల్: పుస్తకాల నిధితో నిండిన గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. జిల్లా ఆడిట్ అధికారి వెంకట్ సహకారంతో పోటీ పరీక్షలకు సిద్ధం కానున్న విద్యార్థులకు అవసరమయ్యే రూ.20వేల విలువ చేసే గ్రూప్–2 పుస్తకాలను గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకన్న పట్టణంలోని గ్రంథాలయ అధికారి ప్రతాప్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో విద్యార్థుల మేధస్సు పెంచేందుకు దోహదపడే పుస్తకాలు ఉంటాయన్నారు. విద్యార్థులు తమకు కావాల్సిన పుస్తకాలను తీసుకునే స్తోమత లేనివారు ఇబ్బందులకు గురవుతుంటారని, అలాంటి విద్యార్థులు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలను సాధించాలన్నారు. ప్రధానంగా గ్రూప్స్‌కు సిద్ధం కానున్న విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు లైబ్రరీలలో అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు పుస్తకాలను చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది స్వప్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డౌన్స్ సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

నందిగామ: ప్రతీ వెయ్యి మంది పిల్లల్లో ఇద్దరికి వ్యాపించే డౌన్స్ సిండ్రోమ్ వ్యాధిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిమ్స్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ రమ్యకృష్ణ సూచించారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో గురువారం జిమ్స్ ఆస్పత్రి, హోమియోపతి కళాశాల ఆధ్వర్యంలో డౌన్స్ సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్యకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైద్య విద్యార్థులు గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రతి వెయ్యి మందిలో ఇద్దరు పిల్లలు ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఏ విధంగా ఉంటాయనే విషయాలను వివరించారు. ఈ వ్యాధిని హోమియోపతి మందులతో తగ్గించొచ్చని, వ్యాధి సోకిన పిల్లలు సాధారణ పిల్లల మాదిరిగానే ఉంటారన్నారు. పిల్లల్లో వచ్చే ఎముకలు, కీళ్లకు సంబంధించిన వ్యాధులు వాటి లక్షణాలు, త్వరగా గుర్తించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లలు ఏ మాత్రం అనారోగ్యానికి గురైనట్లు తెలిసిన వెంటనే అప్రమత్తంగా ఉండాలని, వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు భవ్యశిఖ, విరాజ్, సుచి, రుఖియా, లహరి, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏడీకి సన్మానం



డీఈ, ఏఈలను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగ రీత్యా పదవుల్లో ప్రమోషన్లు సహజమేనని విద్యుత్ శాఖ మండల ఏఈ అమయ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు విద్యుత్ శాఖ సెక్టార్ ఏఈగా పనిచేసిన రాజు ప్రమోషన్‌పై చేవెళ్ల ఏడీగా వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్ గ్రామంలోని చిలుకూరు విద్యుత్ శాఖ సబ్ కార్యాలయంలో అంబేడ్కర్ సంఘం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ ఏఈతో పాటు రాజు స్థానంలో కొత్తగా వచ్చిన శివరామకృష్ణను వారు సన్మానించారు. చిలుకూరు విద్యుత్ శాఖ సెక్టార్‌కు కొత్తగా ఏఈ శివరామకృష్ణ పటాన్‌చెరువు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కంజర్ల శేఖర్, ఉపాధ్యక్షుడు షాబాద్ సందీప్‌కుమార్, సభ్యులు నవీన్, ప్రవీణ్, నాగరాజు, పాల్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సంఘంలో సభ్యత్వం తీసుకుంటున్న బొడ్డు రవి

కొందుర్గు: విద్యారంగ సమస్యల పరిష్కారంలో బొడ్డు రవి అందించిన సేవలు ప్రశంసనీయమని సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకుడు బొడ్డు రవితో గురువారం సేవ్ టీచర్స్ సంఘంలో సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మీయ సోదరుడు బొడ్డు రవి 317 జీఓ అమలులో ఎంతో కృషిచేశాడన్నారు. 22 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో తపస్ ఉపాధ్యాయ విధి నిర్వహణలో ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశాడన్నారు. ఆయన సేవలు ప్రశంసనీయమని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వర్ణలత, రాజశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం



పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పార్టీ మండల ఉపాధ్యక్షులు జి.కృష్ణాగౌడ్, డి.శర్వలింగంలు అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం మండల నాయకులతో కలిసి వారు ఇంటింటికీ తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సభ్యత్వ నమోదుతో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. పార్టీ ఇచ్చిన టార్గెట్‌లను పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు ప్రజలు ఆకర్షితులై సభ్యత్వ నమోదుకు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరూ కలిసి పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అంజనేయులుగౌడ్, బీజేవైఎం జిల్లా నాయకుడు ఇంద్రాసేనారెడ్డి, మండల నాయకులు పి.కృష్ణ, మానిక్యం, వెంకటేశ్, మల్కాపూర్ బూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మల్లేశ్, శివకుమార్, బంటు శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడికి సన్మానం



గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డిని పట్టణానికి చెందిన పలు పార్టీల నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ విధంగానే ఆయన భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతను చాటుదాం



మాట్లాడుతున్న చైర్మన్ బక్కన్నయాదవ్

సింగిల్ విండో చైర్మన్ దారమోని బక్కన్నయాదవ్

షాద్‌నగర్: యాదవుల ఐక్యతను చాటి సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేద్దామని సింగిల్ విండో చైర్మన్ దారమోని బక్కన్నయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని మల్లికార్జున మినీ ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవుల సంస్కృతి సంప్రదాయాలకు సదర్ ఉత్సవం ప్రతీక అన్నారు. అందరూ ఐకమత్యంతో ముందుకుసాగి సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. షాద్‌నగర్‌లో గత పదేళ్లుగా సదర్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా నవంబర్ 10న పట్టణంలోని ముఖ్య కూడలిలో సదర్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, నడికూడ రఘునాథ్ యాదవ్, యాదగిరియాదవ్, జంగ నర్సింలు, తుమ్మల నర్సింహ, షాబాద్ మల్లేశ్, బాత్క దేవేందర్, మెండె కృష్ణయాదవ్, ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్, నక్క బాల్‌రాజ్, శ్రీనివాస్‌యాదవ్, మన్నె నారాయణ, పద్మారం వెంకటేశ్, పరంధాములు, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



దివ్యాంగులతో మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు విజయవంతం చేసేందుకు దివ్యాంగులు పెద్దఎత్తున తరలిరావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ వివిధ గ్రామాల్లో ఉన్న దివ్యాంగులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులను సాధించుకునేందుకు దివ్యాంగులందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలన్నారు. సమష్టిగా పోరాడితేనే హక్కులను సాధించుకుంటామన్నారు. హక్కులతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. హక్కుల సాధనకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నుంచి నిర్వహించే రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరు కానున్నారన్నారు. ఈ మహాసభలకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

అధ్యక్ష పదవి ఎవరికి దక్కేనో?

- పోటీపడుతున్న నేతలు
- ఆరునెలలుగా వాయిదా వేస్తున్న అధిష్టానం
- అధ్యక్షుడి బాధ్యత మాజీ మంత్రి సబితారెడ్డి చేతిలో..
- ఆమె వర్గీయులకే దక్కే ఛాన్స్ ఉందని గుసగుసలు

మొయినాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చాక మండల అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ పెరిగింది. మొయినాబాద్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం సుమారు పది మంది నేతలు పోటీ పడుతున్నారు. అధ్యక్షుడి ఎంపికకు ఇప్పటికే నాలుగైదుసార్లు పార్టీ నాయకులందరూ సమావేశమయ్యారు. ఎక్కువ మంది పోటీ పడుతుండడంతో పార్టీ అధిష్టానం ఎటూ తేల్చకుండా ఆరునెలలుగా నాన్చుతూ వస్తోంది. పార్లమెంటు ఎన్నికల ముందు వరకు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్న మహేందర్‌రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మండల అధ్యక్ష పదవి ఖాళీ అయ్యింది. వెంటనే కొత్తగా పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయాల్సి ఉన్నా ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని పార్టీ అధిష్టానం అధ్యక్షుడి నియామకాన్ని వాయిదా వేసింది. పార్లమెంటు ఎన్నికలు పూర్తయిన తర్వాత మండల అధ్యక్షుడి ఎంపిక బాధ్యతను బీఆర్‌ఎస్ అధిష్టానం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి అప్పగించింది. దీంతో ఆమె మండలంలోని పార్టీ ముఖ్య నేతలతో పలుమార్లు సమావేశమై చర్చించారు. అధ్యక్ష పదవి కోసం ఎక్కువ మంది పోటీ పడుతుండడంతో ఎటూ తేల్చడం లేదని తెలిసింది.

పోటీలో పది మంది

బీఆర్‌ఎస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్ష పదవి కోసం సుమారు పది మంది నాయకులు పోటీపడుతున్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గణేశ్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ముదిగొండ శ్రీహరియాదవ్, బద్దుల సుధాకర్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు మోర శ్రీనివాస్, కొత్త మాణిక్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు ఎంఏ రవూఫ్, దారెడ్డి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్‌మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ చిడిగిద్ద కృష్ణారెడ్డి మండల పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నారు. అధ్యక్ష పదవి దక్కించుకోవడం కోసం ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరంగా చేస్తున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అండదండలు తమకే ఉన్నాయని.. తమకే పార్టీ అధ్యక్ష పదవి దక్కుతుందని కొందరు.. మాజీ మంత్రి సబితారెడ్డి అండదండలతో తమకే అధ్యక్ష పదవి దక్కుతుందని మరి కొందరు ఎవరి ధీమాలో వారు ఉన్నారు.

సామాజిక వర్గాల వారీగా లెక్కలేసుకుంటూ..

బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష పదవిని గత ఎనిమిదేళ్ల పాటు ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇచ్చారని.. ఈసారి మరో సామాజిక వర్గానికి అధ్యక్ష పదవిని ఇచ్చి న్యాయం పాటించాలని కొందరు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీని నడిపించే సత్తా ఉన్న నాయకులకే అధ్యక్ష పదవి ఇవ్వాలని ఇంకొందరి వాదన. అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే చాలాసార్లు సమావేశాలు నిర్వహించినా మాజీ మంత్రి సబితారెడ్డి త్వరలోనే ఈ వ్యవహారాన్ని తేల్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో సబితారెడ్డి వర్గానికి చెందినవారికే అధ్యక్ష పదవి వరిస్తుందని పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో పార్టీ అధిష్టానం ఏం నిర్ణయం తీసుకొని ఎవరిని అధ్యక్షుడిగా ఎంపిక చేస్తుందో వేచిచూడాలి.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్ 9505507564